
# ఏజెంట్ X

యెదుళ్ల సురేష్ రెడ్డి

## ఎలిజబెత్



**నెదర్లాండ్స్ జాతీయురాలైన ఎలిజబెత్ వయసు నలభై అయిదు సంవత్సరాలకు పైగానే ఉంటుంది. మాస్కోలోని నెదర్లాండ్స్ రాయబార కార్యాలయంలో సెక్రటరీగా పనిచేస్తున్న ఆమెకు ఇంకా పెళ్లి కాలేదు. తనకు నచ్చిన వ్యక్తి కోసం ఎదురుచూపులో ఆమె దాదాపు సగం జీవితాన్ని ఒంటరి తనపు వేదనలో గడిపేసింది. ఆమె ఎదురుచూపు ఫలించలేదు గానీ వయసు మాత్రం ముదిరి పోయింది. ఇప్పుడిక ఈ వయ సులో పెళ్లవుతుందన్న నమ్మకమూ లేదు.**

తన ఒంటరితనపు వేదన నుండి బయట పడడానికి ఆమె చిత్రలేఖనాన్ని ఆశ్రయించింది. స్వతహాగా దైవభక్తి ఎక్కువ కావడంతో మత సంబంధమైన పుస్తకాలు, మత ప్రవక్తల ప్రవచనాలు ఆమెకు స్నేహితులయ్యాయి. వివిధ దేశాల్లోని క్రైస్తవ చర్చిలకు సంబంధించిన విషయాలపట్ల ఆమె ఎక్కువగా ఆసక్తి చూపేది. ఒకవైపు ఉద్యోగంతోనూ, మరోవైపు తన అభిరుచులతోనూ సమయాన్ని గడుపుతున్నా తన ఒంటరితనం మాత్రం ఆమెను విపరీతంగా బాధించేది. తనను సంపూర్ణంగా అర్థం చేసుకుని, ప్రేమించి, ఆనందాన్ని పంచి ఇచ్చే మంచి స్నేహితుని కోసం ఆమె నిరంతరం కలలు కనేది.

అలాంటి సమయంలో ఆమెకు ఒకతను పరిచయమయ్యాడు. ఆమెకన్నా దాదాపు పది సంవత్సరాలు చిన్నవాడైన ఆ రష్యా జాతీయుని పేరు బోరిస్ కుడిన్‌కిన్. రష్యన్ ఆర్థోడాక్స్ చర్చిలోని విదేశీ విభాగంలో పనిచేసే అతనితో ఆమె అనుబంధం త్వరలోనే బలపడింది. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ సరదాగా ఉండే అతను ఆమెకు మంచి స్నేహితుడయ్యాడు. ఇద్దరూ కలిసి పార్కులకు, సినిమాలకు, రాత్రిపూట డిన్నర్‌లకు వెళ్లేవారు.. ఎలిజబెత్‌తోపాటు అతను కూడా మత సంబంధమైన విషయాలపట్ల ఎక్కువగా ఆసక్తి చూపేవాడు. ఇద్దరూ కలిసి గంటల తరబడి వివిధ చర్చిల్లో ఉన్న తైలవర్ణ చిత్రాల పూర్వాపరాల గురించి చర్చించుకునేవారు. అతని సాన్నిధ్యంలో ఆమె త్వరలోనే తన ఒంటరితనాన్ని మరచి పోయింది. తనకు తెలియకుండానే అతనిపైన ప్రేమలో కూరుకుపోయింది. ఇద్దరూ ఎన్నో రాత్రుళ్లు ఎలిజబెత్ అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా గడిపేవారు.

ఒకరోజు తన స్నేహితుడైన నికోలాయ్ బుటోవ్‌ని తీసుకువచ్చి ఆమెకు పరిచయం చేశాడు బోరిస్. అతను రష్యా ప్రభుత్వంలో చాలా పలుకుబడి ఉన్న వాడనీ, ప్రభుత్వంలోని ఎంతో మంది ముఖ్యులతో అతనికి దగ్గరి సంబంధాలు ఉన్నాయనీ బోరిస్ ఆమెతో చెప్పేవాడు. వారిద్దరి స్నేహాన్ని గురించి తెలిసిన బుటోవ్ వారిని మరింతగా ప్రోత్సహించాడు.

ఒకసారి తన ఇద్దరు స్నేహితురాళ్లతో కలిసి సెలవు రోజుల్ని సరదాగా గడపడం కోసం ఆమె లెనిన్‌గార్డ్‌కు వెళ్లింది. అక్కడ ఒక హోటల్లో గది తీసుకున్న ఆమెకు అనుకోకుండా అక్కడ బోరిస్ కలిశాడు. మరో పనిమీద అదే పట్టణానికి వచ్చిన అతను కూడా ఆ హోటల్లోనే ఉండడంతో ఆమె ఎంతో సంతోషించింది. ఆమె తన స్నేహితురాళ్లను వదిలేసి ఎక్కువగా అతనితోనే గడపడం

అదిత్య మ్యూజికల్ సెంటర్

ప్రారంభించింది. బోరిస్ గదిలో ఇద్దరూ శృంగారంలో తేలియాడారు. లెనిన్‌గార్డ్‌లో ఉన్నన్ని రోజులు వారికి ఆ హోటల్ గది స్వర్గధామమైంది.

★ ★ ★

వారం రోజుల తరువాత నెదర్లాండ్స్ ఎంబసీలోని తన గదిలో కూర్చుని పని చేసుకుంటున్న ఎలిజబెత్ తన ముందున్న ఫోను మ్రోగడంతో రిసీవర్ని ఎత్తింది.

"ఎలిజబెత్.. నీతో అర్జంటుగా మాట్లాడాలి వెంటనే నా దగ్గరకు రా..." అవతలి వైపు నుండి బోరిస్ కంఠం ఆత్రుతగా విన్పించింది.

"ఏమైంది బోరిస్...!?" అతని కంఠంలోని ఆత్రుతను గుర్తించి కంగారుగా అడిగిందామె.

"అదంతా ఫోనులో చెప్పడం కుదరదు. నువ్వు వెంటనే ఇక్కడికి రా..." అంటూ మరో మాట లేకుండా ఫోను పెట్టేశాడతను.

ఏం జరిగిందో అర్థంకాని ఎలిజబెత్ ఆదరాబాదరాగా అతని వద్దకు వెళ్లింది. "ఏమైంది బోరిస్? ఎందుకలా కంగారుగా ఉన్నావు...? ఈ వారం రోజులూ ఎక్కడికి వెళ్లావు...!?" అతని వద్దకు వెళ్లగానే టెన్షన్‌ని భరించలేనట్టు ఆత్రుతగా అడిగిందామె.

వెంటనే సమాధానం చెప్పకుండా ఆమెను కూర్చోమన్నట్టుగా సైగ చేశాడతను. ఆ తరువాత నెమ్మదిగా చెప్పాడు. "ఈ వారం రోజులూ నేను లుబియాంకా జైలులో ఉన్నాను."

ఆమె ఉలిక్కిపడ్డట్టుగా చూసింది. "జైలులోనా...!?" అంటూ అడిగింది విస్మయంగా.

అతను అవునన్నట్టుగా తల ఊపాడు. 'మనం లెనిన్‌గార్డ్ నుండి వచ్చిన మరుసటి రోజే నన్ను కె.జి.బి. ఏజంట్లు అరెస్టు చేసి లుబియాంకా జైలుకు తీసుకెళ్లారు. ఈ వారం రోజులూ నన్ను అక్కడే ఉంచి ఇంటరాగేట్ చేశారు వాళ్లు.'

"ఎందుకు...!?" అర్థంకానట్టుగా అడిగిందామె.

"మన పరిచయం గురించి వారికి తెలిసిపోయింది. నీతో పరిచయం ఉండడంవల్ల నన్ను నెదర్లాండ్స్ గూఢచారిగా అనుమానిస్తున్నారు వాళ్లు. అంతేకాదు, మనిద్దరం లెనిన్‌గార్డ్‌లోని హోటల్ గదిలో గడిపినప్పుడు రహస్యంగా ఫోటోలు తీశారు. మన సంభాషణలన్నింటినీ రికార్డు చేశారు. మనిద్దరి మధ్య శారీరక సంబంధం ఉందనడానికి వారి దగ్గర స్పష్టమైన రుజువులు ఉన్నాయి. ఆ సాక్ష్యాలతోనే నన్ను నెదర్లాండ్, గూఢచారిగా అనుమానించి ఇంటరాగేట్ చేశారు. మనిద్దరి సంబంధం గురించిన వివరాలన్నీ అడిగారు. ఇప్పుడీ విషయాలన్నీ బయటపడ్డాయంటే మనిద్దరి జీవితం సర్వనాశనమవుతుంది."

భయంతోనూ, విస్మయంతోనూ అతను చెప్పేదాన్ని నోరు తెరుచుకుని వింటుండిపోయింది ఎలిజబెత్. "నిజమా...!?' అంటూ అడిగింది వణుకుతున్న కంఠంతో.

అతను తల ఊపాడు. 'ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ విషయాలేవీ బయటకు రాకూడదు. కె.జి.బి ఏజంట్లు మన ఫోటోల్ని బయటపెట్టకుండా అడ్డుకోవాలి. లేకపోతే మనకు ఆత్మహత్య తప్ప మరో గత్యంతరం లేదు."

"ఎలా... ఏం చేద్దాం...?" అర్థం కానట్టుగా అడిగిందామె. అతను చెప్పినట్టుగా తమ శృంగారాన్ని బట్టబయలు చేసే ఆ ఫోటోలు బయటపడితే ఏం జరుగుతుందో ఆమెకు తెలుసు.

ఏం చెప్పాలో అర్థం కానట్టు అతను మౌనంగా ఉండిపోయాడు. ఈలోగా ఏదో ఆలోచన స్ఫురించినట్టు ఆమె అంది. "నీ స్నేహితుడు బుటోవ్‌కి ఇక్కడి అధికారులతో మంచి సంబంధాలు ఉన్నాయని చెప్పావు గదా. అతని ద్వారా కె.జి.బి ఏజంట్లకు నచ్చచెపితే ఎలా ఉంటుంది...?"

"అవును, ప్రస్తుతం అంతకన్నా మరో మార్గం లేదు" అన్నాడు బోరిస్.

వాళ్లు చెప్పిందంతా పూర్తిగా విన్నాడు బుటోవ్. తనతో అయిన సహాయం చేస్తానని మాట ఇచ్చాడు. ఆ మరుసటి రోజు కె.జి.బి ఏజంట్ల వద్ద నుండి తెచ్చిన ఫోటోల్ని ఎలిజబెత్‌కి చూపించాడు. లెనిన్‌గార్డ్‌లోని హోటల్ గదిలో వాళ్లు నగ్నంగా ఉండగా తీసిన ఫోటోలు అవన్నీ...

"ఈ ఫోటోలు బయటపడితే మీ ఇద్దరి బ్రతుకులు సర్వనాశనమవుతాయి" అన్నాడు బుటోవ్. "వీటి తాలూకు నెగెటివ్‌లు ఇంకా ఆ ఏజంట్ల దగ్గరే ఉన్నాయి. వాటిని ఇవ్వడానికి నిరాకరించారు వాళ్లు".

"ఎలా ఇప్పుడు... ఆ నెగెటివ్‌లను సంపాదించే మార్గం లేదా...?" బెదురుగా అడిగిందామె.

తల అడ్డంగా ఊపి "వాళ్లు ఇవ్వరు" అన్నాడతను. "ఏ విధంగానూ మనం వాటిని సంపాదించలేం కానీ ఒక పనిచేస్తే వాళ్లు వాటిని బయటపెట్టకుండా ఆపగలం. మీ ఎంబసీలోని సీక్రెట్స్‌ని సేకరించి వారికి అందించాలి. అలా చేస్తే ఆ ఫోటోలు బయటకు రాకుండా చూస్తామని వాళ్లు హామీ ఇచ్చారు".

ఆమె బెదురుగా చూసింది. "అలాంటి పని నేను చెయ్యను" అంది దృఢంగా.

"పిచ్చి పిచ్చిగా మాట్లాడకు" అన్నాడు బుటోవ్ కాస్త కోపంగా. 'ఈ ఫోటోలు బయటపడితే నీతోపాటు బోరిస్ జీవితం కూడా నాశనమవుతుంది. నిన్ను ప్రాణంకన్నా మిన్నగా ప్రేమించిన అతని జీవితం నాశనమవుతుంటే చూస్తూ ఊరు కుంటావా...? ఇదేనా నువ్వు అతని ప్రేమకు ఇచ్చే విలువ...? నా మాట విను. మీ ఎంబసీలోని ఏవో కొన్ని రహస్యాలు కె.జి.బి ఏజంట్లకు అందించినంత మాత్రాన వచ్చే నష్టమేదీ లేదు. అలాచేస్తే నీతోపాటు నీ ప్రియుని జీవితాన్ని కూడా రక్షించుకోగలుగుతావు. ఆలోచించుకో...'

తనను మనస్ఫూర్తిగా ప్రేమించిన బోరిస్ జీవితం నాశనమవడానికి ఇష్టపడని ఆమె మరో గత్యంతరంలేని పరిస్థితుల్లో ఈతని సలహాకు అంగీకరించింది. తను పనిచేసే నెదర్లాండ్స్ రాయభార కార్యాలయంలోని రహస్య సమాచారాన్నంతా సేకరించి బుటోవ్‌కి అందించడం ప్రారంభించింది. ఈలోగా నెదర్లాండ్స్ ప్రభుత్వం ఆమెను మాస్కో నుండి మరోచోటుకి బదిలీ చేసింది. అక్కడ కూడా బుటోవ్ ఆమెను వదిలిపెట్టలేదు. అక్కడి ఎంబసీలోని సీక్రెట్ డాక్యుమెంట్లను తీసుకురావాల్సిందిగా ఆదేశించాడు. బుటోవ్ స్వయంగా కె.జి.బి గూఢచారి అనీ, తను బోరిస్‌తో కలిసి లెనిన్‌గార్డ్‌లోని హోటల్ గదిలో ఉండగా అతనే రహస్యంగా ఫోటోలు తీయించాడనీ ఆమెకు అర్థమైంది. అతని బెదిరింపులకు భయపడి మరెన్నో రోజులు రష్యా ఏజంటుగా పనిచేయలేక పోయిందామె. తన దేశ రహస్యాలు అతనికి అందించడంకన్నా జరిగింది జరిగినట్టుగా తన ప్రభుత్వానికి తెలియజేయడం మంచిదన్న ఉద్దేశ్యంతో బోరిస్ తనకు పరిచయం కావడం నుండి అప్పటి వరకూ జరిగిందంతా నెదర్లాండ్స్ సెక్యూరిటీ ఆఫీసర్లతో చెప్పేసింది. ఆమె అందించిన సమాచారం మేరకు పరిశోధన ప్రారంభించిన నెదర్లాండ్స్ సెక్యూరిటీ ఆఫీసర్ల ఎంక్వయిరీలో మరెన్నో ఆసక్తికరమైన విషయాలు బయటపడ్డాయి.

బుటోవ్‌తోపాటు బోరిస్ కూడా కె.జి.బి గూఢచారి అనీ, వాళ్లిద్దరూ ఒక పథకం ప్రకారమే ఆమెతో ప్రేమ నాటకాన్ని ప్రారంభించి, రహస్యంగా ఫోటోలు తీసి ఆమెను బ్లాక్‌మెయిల్ చేశారనీ ఆ ఆఫీసర్లు చెప్పినప్పుడు మొహాన్ని చేతుల మధ్య దాచుకుని వెక్కి వెక్కి రోదిస్తూ ఉండిపోయింది ఎలిజబెత్.

*(ఎలిజబెత్ అన్నది ఈ గూఢచారిణి అసలు పేరు కాదు)*

●




"చాలా చక్కగా, అందంగా ఉంది. మీ చెల్లెలా? నువ్వు మీ చెల్లెలి కన్నా చాలా పెద్ద అనుకుంటాను." పలకరించింది రమ స్నేహితురాల్ని.

"నేను అంత పెద్ద ఏం కాదు. దానికి, నాకు ఒక్క పుష్కరం తేడా అంతే!" వివరించింది స్నేహితురాలు.

పి. సరోజ (అమలాపురం)